క్లుప్తంగా

వాటర్‌షెడ్ పనుల పరిశీలన

ప్యాపిలి: కలచట్ల గ్రామంలో చేపడుతున్న వాటర్‌షెడ్ పనులను నాబార్డు డీడీఎం కార్తీక్ గురువారం పరిశీలించారు. ఫారంపాండ్, మట్టికట్టలు, రాతికట్టల పనులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాటర్‌షెడ్ పనులు రైతులకు ఉపయోగకరం అన్నారు. రైతులు ఆధునిక పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను విరివిగా వాడాలన్నారు. వాటర్‌షెడ్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, ఇంజినీర్ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

కోవెలకుంట్ల: స్థానిక గ్రామ పంచాయతీ సర్కిల్‌లో వీహెచ్‌పీఎస్(వికలాంగుల హక్కుల పోరాట సమితి) 18వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి రాజు, వీహెచ్‌పీఎస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు గాయత్రి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి వేడుకలు జరిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ నెలకొల్పిన వీహెచ్‌పీఎస్ దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేసి అనేక సమస్యలు సాధించుకోగలిగిందన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కత్తి ఓబులేసు, నాగేశ్వరరావు, విజయ్, నవీన్, వీహెచ్‌పీఎస్ నాయకులు సుబ్బరాయుడు, మద్దిలేటి, రమణ, రంగస్వామి పాల్గొన్నారు.

పరామర్శ

సంజామల: మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసి తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు దాసి నాగేంద్రమ్మ కుమారుడు దాసి చైతన్యారెడ్డి (20) ఈ నెల 24న అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించాడు. ఆయనతో పాటు పార్టీ నాయకులు కాటసాని తిరుపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ పోచా వెంకటరామిరెడ్డి, పోచారామిరెడ్డి,వెంకటసుబ్బారెడ్డి ఉన్నారు.

శుభకార్యం

బనగానపల్లె: పట్టణ సమీపంలోని సీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం పండ్లాపురం గ్రామానికి చెందిన బుర్ర చౌడయ్య కుమారుడి వివాహం జరిగింది. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి ఉన్నారు.

ఆరుగురికి కారుణ్య నియామకాలు



కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్: ఇటీవల కాలంలో ఆరుగురు మున్సిపల్ కార్మికులు మృతిచెందగా వారి కుటుంబీకుల్లో ఒక్కరికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగ అవకాశం కల్పించామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష తెలిపారు. గురువారం తన చాంబర్‌లో సీపీఎం, సీపీఐ నాయకులు మంగమ్మ, చిరంజీవి, హరి, శివ తదితరులు చైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా కార్మిక కుటుంబాలు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్, కార్మిక సంఘం నేతలు సుంకయ్య, అబ్బాస్, శివరాం, మద్దయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

బేతంచెర్ల: మానసిక సమస్యలతో బాధపడుతూ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మండలంలోని గూటుపల్లె గ్రామానికి చెందిన పనారపు విజయ్‌కుమార్ (22) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. గత కొద్దిరోజులుగా మానసికంగా కృంగిపోయి ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిసింది. ఈనెల 26వ తేదీ ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతున్న సమయంలో కోలుకోలేక గురువారం ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి తల్లి లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

గుండెపోటుతో కోర్టు ఉద్యోగి మృతి

కోవెలకుంట్ల: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పనిచేస్తున్న షకిల్ అహమ్మద్(55) గుండెపోటుతో మృతి చెందారు. నంద్యాలకు చెందిన ఈయన కోవెలకుంట్ల కోర్టుకు బదిలీ కావడంతో గురువారం విధుల్లో చేరారు. విధి నిర్వహణలో ఉండగా సాయంత్రం గుండెపోటుకు గురై కుప్పకూలిపోయారు. తోటి సిబ్బంది ఆసుపత్రికి తరలించే లోపే మృత్యువాత పడ్డారు. విధుల్లో చేరిన తొలిరోజే మృతి చెందడంతో కోర్టు ఆవరణలో విషాదఛాయలు అలుముకున్నాయి.




కొలిమిగుండ్ల: డాక్టర్ గుర్రన్న కాలనీలో..



డోన్: ప్రజావైద్యశాల వీధిలో కరెన్సీ వినాయకుడు ,



కోవెలకుంట్ల: పాండురంగస్వామి దేవాలయ ఆవరణలో ఆకట్టుకున్న సెట్టింగ్ ,



అవుకు: తేరు సమీపంలో..

ఉండ్రాలయ్యా.. దండాలయ్యా..!

- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- విశేష పూజలు చేసిన భక్తులు
- మండపాల్లో అన్నదానాలు

బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల వ్యాప్తంగా బుధవారం వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వాడవాడలా మండపాలు ఏర్పాటు చేసి గణపయ్య విగ్రహాలను కొలువుదీర్చారు. విశేష పూజలు నిర్వహించారు. వివిధ రూపాల్లో కొలువుదీరిన లంబోదరుడి విగ్రహాలు ఆకట్టుకున్నాయి. పండుగ సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం ఏర్పడింది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ఉత్సవాలను ఆనందోత్సాల మధ్య జరుపుకున్నారు. చిన్నారులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కోవెలకుంట్ల పట్టణంలో 47 చోట్ల, మండల వ్యాప్తంగా 52 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. సంజామల మండలంలో 100 విగ్రహాలు, బేతంచెర్ల మండలంలో 146 విగ్రహాలను కొలువుదీర్చారు. ఆయా మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. కాగా శుక్రవారం పలు చోట్ల గణేష్ నిమజ్జనం చేయనున్నారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎలాంటి గొడవలకు అస్కారం లేకుండా శోభాయాత్ర, నిమజ్జనం పూర్తి చేయాలని పోలీసులు నిర్వాహకులకు సూచించారు. ప్యాపిలి మండల కేంద్రంలో వినాయకచవితి వేడుకలపై నిషేధం కొనసాగింది. ప్రజలు ఇళ్లలో కొలువుంచిన చిన్న విగ్రహాలకు పూజలు చేశారు. –సాక్షి నెట్‌వర్క్



బేతంచెర్ల..గణేశుడిని దర్శించుకుంటున్న భక్తులు

ఏకదంతుడి సేవలో కాటసాని



బనగానపల్లెలో గణనాథుడికి పూజలు చేస్తున్న కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సతీమణి జయమ్మ దంపతులు తమ స్వగృహంలో గణనాయకుడికి విశిష్ట పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, రైతులు పాడిపంటలతో ఆనందంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇంటి పక్కన కొలువుదీరిన వినాయకుడిని సీనియర్ నాయకుడు కాటసాని ప్రసాదరెడ్డి, రామిరెడ్డి దర్శించుకున్నారు. పెండేకంటినగర్ వినాయకుడి వద్ద బుధవారం రాత్రి నిర్వహించిన లడ్డూవేలం పాటలో కాంట్రాక్టర్ గాలి సుదర్శన్‌రెడ్డి రూ.6.10 లక్షలకు దక్కించుకున్నారు. కాటసాని తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



డోన్: ఇందిరానగర్‌లో..



కోవెలకుంట్ల: గాంధీనగర్‌లో..



కోవెలకుంట్లలో లంబోదరుడు

గణనాథుడికి బుగ్గన పూజలు

డోన్: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం పట్టణంలోని వినాయక మండపాలను సందర్శించి, గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. కొత్త బస్టాండ్, పాతపేట, అమ్మవారిశాల, కొండపేట ప్రాంతాల్లో కొలువుదీరిన వినాయకులను దర్శించుకున్నారు. ఆయన వెంట మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండలఅధ్యక్షుడు సోమేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.



కొండపేటలో స్వామివారిని దర్శించుకుంటున్న బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



కొలిమిగుండ్లలో..



బేతంచెర్ల జంగాలపేట కాలనీలో..











మద్దిలేటి స్వామి ఆలయంలో.. ,పెండేకంటినగర్‌లో రూ.6.10లక్షలకు దక్కించుకున్న లడ్డూతో గాలిసుదర్శన్‌రెడ్డి, డోన్: పాతపేట గణనాథుడు, బేతంచెర్ల అమ్మవారిశాల వద్ద.., ఇందిరానగర్‌లో వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్

పశువుల్లో సీజనల్ వ్యాధుల ముప్పు

బనగానపల్లె రూరల్: పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య అన్నారు. గురువారం స్థానిక పశువైద్యశాలలో సిబ్బందితో సమావేశమయ్యారు. వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. నివారణ కోసం ముందస్తు టీకాలు వేయాలని సూచించారు. అలాగే పాడి రైతులకు 75శాతం సబ్సిడీతో పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయని.. కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం పొందిన పశువైద్య ఉద్యోగి ముక్తియార్‌ను సన్మానించారు. ఏడీఏ డాక్టర్ మారుతిసకారామ్ తదితరులు పాల్గొన్నారు.



పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య

మోటార్ కేబుల్ వైర్ల చోరీ

బేతంచెర్ల: మండలంలోని ముద్దవరం గ్రామంలో మంగళవారం రాత్రి దొంగలు 25 మంది రైతుల మోటార్ల వద్ద నుంచి కేబుల్ వైర్లను దొంగిలించారు. అనంతరం అవి గుర్తుపట్టకుండా ఉండేందుకు కొండపైకి తీసుకెళ్లి కాల్చేస్తుండగా, అక్కడికి వెళ్లిన రైతులను చూసి దొంగలు ద్విచక్రవాహనం, కేబుల్ వైర్లు వదిలేసి పరారయ్యారు. రైతులు బుధవారం కాలిపోయిన కేబుల్ వైర్లు, ద్విచక్రవాహనాన్ని పోలీసులకు అప్పగించారు. తరచూ ఇలాంటి దొంగతనాలు జరుగుతున్నాయని గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, రైతులు బుగ్గన కుమార్ రెడ్డి, తిమ్మ గురుడు, హనుమంత్‌రెడ్డి, మద్దిలేటి స్వామి, శివారెడ్డి, మౌలాలి, జయుడు నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిసారి ఒక్కో రైతుకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు నష్టం జరుగుతోందని, నాలుగేళ్లుగా మోటార్ కేబుల్ వైర్లు, స్టాటర్ పెట్టెలు దొంగతనానికి గురవుతున్నాయని తెలిపారు. గత నెలలో ముసలాయి చెరువు గ్రామంలో 20 బోర్లు, బైనపల్లె, సీతారామాపురం, శంకలాపురం, ఎంబాయి గ్రామాల్లోనూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని వివరించారు.

సంక్షిప్తం

త్వరలో అందుబాటులోకి యూరియా

అవుకు(కొలిమిగుండ్ల): మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలకు త్వరలో యూరియా అందుబాటులోకి వస్తుందని వ్యవసాయాధికారిణి కలిమున్నీషా గురువారం తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సెప్టెంబర్ 2,3 తేదీల్లో యూరియా అందుబాటులోకి వస్తుందన్నారు. రైతులు యూరియాను అవసరమైన మేరకు మాత్రమే వాడాలని సూచించారు. ముందస్తు కోసం ఎక్కువ మొత్తంలో ఎవరు నిల్వ చేయరాదన్నారు. నిల్వ చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రంథాలయ భవనం ప్రారంభం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో రూ.13 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి గురువారం ప్రారంభించారు. గ్రామంలోని విద్యార్థులతోపాటు పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే అభ్యర్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. అనంతరం పట్టణంలోని పలు గణేశ్ మండపాలను సందర్శించారు.

మొక్కలతోనే పర్యావరణ సమతుల్యత

డోన్: మొక్కలను విరివిగా నాటి సంరక్షించడం వల్ల పర్యావరణ సమతుల్యాన్ని కాపాడిన వారమవుతామని వివేకానంద సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్మోహన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ గుండా వెంకటరత్నం శెట్టి డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం వివేకానంద సేవాసమితి తరుపున 50 మొక్కలను నాటారు. వాతావరణ కాలుష్యం, అంతరించిపోతున్న అడవుల మూలంగా ధరిత్రికి పెను ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కలు నాటడం ద్వారానే పర్యావరణాన్ని కాపాడి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలుగుతామని పేర్కొన్నారు.సేవాసమితి కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీను, సభ్యులు కుళ్లాయప్ప, రంగయ్య, రాజశేఖర్ రెడ్డి, శేఖర్, రోటరీక్లబ్ అధ్యక్షుడు క్రిష్ణ పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ ఉద్యమ మృతులకు నివాళి

డోన్ టౌన్/బేతంచెర్ల: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000 ఆగస్టు 28న జరిగిన విద్యుత్ ఉద్యమం ఛలో అసెంబ్లీ కార్యక్రమంలో, హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో పోలీసులు జరిపిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన కామ్రేడ్స్ విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాలస్వామిని వామపక్షాలు గురువారం స్మరించుకున్నాయి. పట్టణంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాతబస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించారు. అలాగే బేతంచెర్లలో సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు నివాళులర్పించారు.

పూర్వ విద్యార్థుల తోడ్పాటు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన మద్దిలేటిస్వామి ఆలయ పూజారి సాగర్ (39) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. తోటి మిత్రులు, 1999–2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సాగర్ కుటుంబానికి రూ. 19 వేల ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. పూర్వ విద్యార్థులు వెంకటరమణ, బాలజీ, మహేశ్వర్‌రెడ్డి, మధుశేఖర్ నాయుడు, కుమారస్వామి, తిరుపతయ్య పాల్గొన్నారు.

బైక్ బోల్తా.. యువకుడికి గాయాలు

బేతంచెర్ల: ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడడంతో యువకుడు గాయపడ్డాడు. బేతంచెర్ల పట్టణంలోని అమ్మవారిశాల వద్ద గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బేతంచెర్ల తాసిల్‌పేటకు చెందిన శివప్రసాద్ ఇంటి నుంచి అమ్మశాల వైపు వెళ్తుండగా వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కర్నూలుకు తరలించారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. గ్రామస్తుల సమాచారం మేరకు..ఆకుమల్ల గ్రామానికి చెందిన బాషా గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ దగ్గరికి వెళ్లి తిరిగి వస్తుండగా, అదే సమయంలో అవుకు గ్రామానికి చెందిన రంగయ్య మరో వ్యక్తితో కలిసి కోవెలకుంట్ల వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరికి తలకు, చేయికి గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నంద్యాల ఆసుపత్రికి పంపించారు.

గొర్రెల అపహరణ

కొలిమిగుండ్ల: మదనంతపురం–అబ్దులాపురం గ్రామాల మధ్యలో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెలు అపహరించారు. వివరాలు.. మదనంతపురానికి చెందిన తండ్రీకొడుకులు చిన్న రంగప్ప, రామకృష్ణ ఈ రెండు గ్రామాల మధ్యనున్న దేవుని మాన్యంలో కంచె వేసుకుని గొర్రెల మందను ఉంచారు. గుర్తుతెలియని వ్యక్తులు మందలోకి చొరబడి 11 గొర్రెలను తీసుకెళ్లారు. గొర్రెలు అరవడంతో ఇద్దరు లేచి టార్చిలైట్లు వేయడంతో తండ్రీకొడుకులపై రాళ్లతో దాడికి పాల్పడ్డారు. పరుగున ఊర్లోకి వచ్చి గ్రామస్తులకు విషయం చెప్పడంతో అందరూ కలిసి అక్కడికి వెళ్లే సరికి దొంగలు అప్పటికే వెళ్లిపోయారు. అపహరణకు గురైన గొర్రెల విలువ రూ.1.50 లక్షలు చేస్తాయని బాధితులు చెప్పారు. ఈవిషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

టీడీపీ స్త్రీశక్తి ర్యాలీలో మహిళల అవస్థలు

డోన్: టీడీపీ ఆధ్వర్యంలో గురువారం డోన్‌లో జరిగిన సూపర్ సిక్స్.. సూపర్‌హిట్ కార్యక్రమంలో భాగమైన స్త్రీ శక్తి ర్యాలీకి హాజరైన మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పార్టీ నాయకులు ప్రైవేట్, ప్రభుత్వ వాహనాల్లో గ్రామాల నుంచి భారీగా మహిళలను తరలించినప్పటికీ, వారికి సరైన భోజన వసతి కల్పించడంలో విఫలమయ్యారు. భోజనం కూడా పెట్టకపోతే సమావేశాలు ఎందుకు పెడతారని మహిళలు నిర్వాహకులను నిలదీశారు. వారి మాటల ధాటికి తట్టుకోలేక గ్రామస్థాయి నేతలు హోటళ్లకు తీసుకెళ్లి తినిపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా ట్రాలీ ఆటోల్లో టాప్‌పై మహిళలను ఎక్కించి ర్యాలీకి తరలించడం విమర్శలకు దారి తీసింది. ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, ర్యాలీ సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్‌ను దారి మళ్లించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



ఆటో టాప్‌పై కూర్చొని వెళ్తున్న మహిళలు

రక్తదానం ప్రాణదానంతో సమానం

కోవెలకుంట్ల: ఆపదలో ఉన్న వ్యక్తులకు సకాలంలో రక్తం అందించి ప్రాణదాతలు కావాలని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ప్రజా వైద్యశాల ఆవరణలో యూత్ ఫ్రెండ్స్‌ఫర్‌సేవా సంస్థ అధ్యక్షుడు శివారెడ్డి ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన 50 మంది యువకులు రక్తదానం చేశారు. డాక్టర్లు కల్యాణ్, రణధీర్, భాను, కేసీకెనాల్ డీఈ భాస్కర్‌బాబు, చిన్నబాబు, భరత్, రామకృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

బనగానపల్లె: వినాయక చవితి సందర్భంగా గణేష్ ఫ్రెండ్స్ అర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మూడో సచివాలయం వద్ద గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్, ఏఈ సాయికృష్ణ ప్రారంభించారు. శిబిరంలో 25 మంది రక్తదానం చేశారు. వీరికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

సర్వేలు పూర్తి చేయాలి

సంజామల: సర్వేలు సకాలంలో పూర్తి చేయాలని డీఎల్‌డీఓ శివారెడ్డి అన్నారు. సంజామల మండలం పరిధిలోని పేరుసోముల, గిద్దలూరు, కానాల గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న సర్వేలను ఎంపీడీఓ రామసుబ్బయ్యతో కలిసి గురువారం తనిఖీ చేశారు. మండలంలో 17 పంచాయతీలకు గాను 12 పంచాయతీలకు స్వామిత్ర, కౌసలం సర్వేలు చేస్తున్నారని తెలిపారు. సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

సర్వేలు సకాలంలో పూర్తి చేయాల్సిందే

కొలిమిగుండ్ల: సచివాలయ సర్వేలన్నీ సకాలంలో పూర్తి చేయాలని డీఎల్‌డీఓ శివారెడ్డి పేర్కొన్నారు. గురువారం అంకిరెడ్డిపల్లె గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ చంద్రమౌళీశ్వరగౌడ్‌తో కలిసి తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సర్వేలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందకుండా చూసుకోవాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య లోపం లేకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డికి సూచించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సీఐటీయూ నూతన కమిటీ

డోన్ టౌన్: సీఐటీయూ డోన్ మండల కన్వీనింగ్ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోట్లవారిపల్లెలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సీఐటీయూ 7వ మండల మహాసభలో వీరి ఎన్నిక జరిగింది. కన్వీనర్‌గా ఏవీ భాస్కర్ రెడ్డి, కో–కన్వీనర్‌గా బి.నాగమద్దయ్యతో పాటు 29 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రమాదకరంగా మద్దిలేటిస్వామి రోడ్డు

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రం నుంచి కటికవానికుంట మీదుగా మద్దిలేటిస్వామి క్షేత్రం వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు ప్రమాదకరంగా మారిందని.. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం రోడ్డు పక్కన కూలిపోయిన రక్షణ గోడను పరిశీలించారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రోడ్డును బాగుచేయాలని కోరారు.



కూలిన రక్షణ గోడను చూపిస్తున్న సీపీఐ నేతలు